క్లుప్తంగా

దరఖాస్తు చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపూలే బాలుర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ కె.వీర ప్రభాకర్ తెలిఆరు. స్థానిక కళాశాలలో ఆయన మాట్లాడుతూ..ఇంటర్మీడియట్ పూర్తయిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ సంవత్సరం కొత్తగా ఏర్పాటు చేసిన కళాశాలలో చేరేందుకు ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బాధ్యతల స్వీకరణ

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట సెస్ ఏఈగా రాకేశ్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు సెస్ డైరెక్టర్ మల్లుగారి రవీందర్ రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. సెస్ జేఏవోగా బాధ్యతలు స్వీకరించారు.

నేడు ఆండాల్ తిరునక్షత్రోత్సవం


ముస్తాబైన స్వామివారు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని సుప్రసిద్ధ శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం ఆండాల్ తిరు నక్షత్రోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నంది కిషన్ శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందిస్తామన్నారు. సాయంత్రం 6 గంటలకు పారాయణం, భజన కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు.

పేదలను ఆదుకోవాలి

వేములవాడరూరల్: ప్రభుత్వం పేదలను ఆదుకొని బీసీ బంధును వర్తింపజేయాలని ఎంపీపీ బండ మల్లేశం యాదవ్ అన్నారు. మండలంలోని మర్రిపల్లి, మల్లారం, లింగంపల్లి తదితర గ్రామాల్లో ఉన్న కల్వర్టులను ఆయన పరిశీలించారు. మర్రిపల్లిలో వర్షాలతో ఇళ్లు కోల్పోయిన సంకెపల్లి లక్ష్మీరాజం కుటుంబాన్ని ఆయన పరామర్శించి వారికి ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఎంతోమంది నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వారిని గుర్తించి బీసీ బంధు అందించాలన్నారు. ఆయన వెంట మండల, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

తంగళ్లపల్లి: మండలంలోని ఇందిరమ్మ కాలనీ, చిన్న లింగాపూర్‌లో శుక్రవారం పలువురు లబ్ధిదారులకు సర్పంచుల ఆధ్వర్యంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఇందిరమ్మ కాలనీలో ఎలిగేటి మనోహర్‌కు రూ.20 వేలు, మమతకు రూ.8 వేలు, చిన్నలింగాపూర్‌లో రేగుల నాంపెల్లికి రూ.60 వేలు, రాజయ్యకు రూ.24 వేలు చొప్పున చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు బైరి శ్రీవాణి, మాఎరెడ్డి అవినాష్ రెడ్డి, నాయకులు బైరి రమేశ్, శ్యాగ దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం


అఖిల్‌ను సన్మానిస్తున్న టీఆర్‌టీఎఫ్ నాయకులు

గంభీరావుపేట: మండలకేంద్రానికి చెందిన అఖిల్ శ్రీవత్స చార్టెడ్ అకౌంట్ పూర్తి చేసి ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా టీఆర్‌టీఎఫ్ నాయకులు శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటకం రమేశ్, జిల్లా అధ్యక్షుడు బోయన్నగారి నారాయణ, నాయకులు ప్రభాకర్ రావు, నాగరాజు, గంధ్యాడపు శ్రీనివాస్, మహేశ్, బాలకిషన్, రాంచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

బోరుబావి, మోటారు ధ్వంసం

- భూమి కబ్జా చేసేందుకేనని బాధితుల ఆరోపణ

రుద్రంగి(వేములవాడ): తమ పేరుపై పట్టా ఉన్న సర్వేనెం. 350/అలో గల తమ 30 గుంటల భూమిని కబ్జా చేసేందుకు కొందరు యత్నిస్తున్నారని, ఇంతకు ముందు సాగు చేసిన పెసరను, ఇప్పుడు బోరు బావిని, మోటార్‌ను ధ్వంసం చేశారని రుద్రంగి మండల కేంద్రానికి చెందిన తుమ్మనపెల్లి సరోజన, ఆమె కుమారుడు తమ్మనపెల్లి శ్రీనివాస్ ఆరోపించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గతంలోనే ఈ స్థలం విషయంలో కోర్టుకు వెళ్లి ఇంజెక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నామని, అయినా కోర్టు ఆర్డర్‌ను లెక్క చేయకుండా మళ్లీ ఆ భూమిని అక్రమంగా కొందరికి విక్రయించి తమను ఇబ్బందులకు గురిచేస్తూ బెదిరిస్తున్నారని ఆరోపించారు. పోలీస్ స్టేషన్‌కు వెళితే భూ తగాదా విషయం రెవెన్యూ డిపార్ట్‌మెంట్ వారి వద్దకు వెళ్లాలంటున్నారని, ఇప్పటికే కలెక్టర్, ఎస్పీ వద్దకు వెళ్లామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

ప్రమాదకరంగా వరదకాలువ వంతెన

- వాహనం ఢీకొని కొంతకూలిన పారాఫీట్ వాల్
- పలుచోట్ల గుంతలమయం
- ప్రమాదపుటంచున ప్రమాదం
- ఆందోళన చెందుతున్న ప్రయాణికులు
- మరమ్మతులు చేపట్టాలని డిమాండ్


వాహనం ఢీకొనడంతో కూలిన పారాఫీట్ వాల్ (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి నుంచి కొదురుపాక వెళ్లే రోడ్డులో దేశాయిపల్లి గ్రామ పరిసరాల్లోని వరద కాల్వపై నిర్మించిన వరదకాలువ వంతెన ప్రమాదకరంగా మారింది. 2005లో వరదకాల్వపై సుమారు వందమీటర్లకు పైగా పొడవున్న వంతెన నిర్మించారు. వంతెనపై నుంచి నిత్యం భారీ బరువుతో ఉండే గ్రానైట్ ఇసుక, కంకర తదితర సామగ్రితో వాహనాలు కొదురుపాక వైపు, గంగాధర వైపు వెళ్తుంటాయి. వంతెన పరిసరాలు అధ్వాన్నంగా ఉండడంతో ప్రయాణికులు భయంభయంగా ప్రయాణం కొనసాగిస్తున్నారు.

కొంతమేర కూలిన పారాఫీట్ వాల్

వరదకాల్వపై నిర్మించిన వంతెనకు రెండువైపులా రక్షణ కోసం పారాఫీట్ వాల్ నిర్మించారు. ఆరునెలల క్రితం ఓ గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో వంతెనకు ఓవైపు నిర్మించిన ప్రొటెక్షన్ పారాఫిట్ వాల్ కొంతమేర కూలిపోయింది. దీంతో వాహనం అదుపుతప్పితే ఏకంగా వరదకాల్వలో పడే ప్రమాదం ఉంది. రాత్రి సమయంలో వాహనాలు ఎదురెదురుగా వచ్చే క్రమంలో అదుపుతప్పి కాల్వలో పడే ప్రమాదం ఉంది.

తేలిన కంకర, స్టీల్

వంతెనపై పలుచోట్ల సిమెంట్ లేచిపోవడంతో కంకర తేలింది. రెండువైపులా వంతెన ఎంట్రెన్స్‌లో కంకర తేలడతో పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలు కురుస్తుండటంతో చాలాచోట్ల వరదనీరు నిలుస్తోంది. కొన్నిచోట్ల వంతెన నిర్మాణానికి వాడిన స్టీల్ సైతం తేలి పైన కనిపిస్తోంది. దేశాయిపల్లి నుంచి వెళ్లే క్రమంలో వంతెన మొదట్లో దారి కోతకు గురై పెద్ద కయ్యపడి వంతెన పక్కనుంచి వరద కాల్వలోకి వెళ్తోంది. ఈ కయ్య కనిపించకుండా గుబురుగా చెట్లు ఉన్నాయి.


వంతెనపై గుంతలమయంగా రోడ్డు

చేపట్టని మెయింటనెన్స్ పనులు

వరదకాల్వపై వంతెన నిర్మించి సుమారు 18 ఏళ్ల గడిచింది. అప్పటినుంచి వంతెనపై మెయింటనెన్స్ పనులు చేపట్టిన దాఖలాలు లేవు. ఇరిగేషన్ శాఖ పునర్విభజనలో భాగంగా బోయినపల్లి మండలం కరీంనగర్ జిల్లా ఇరిగేషన్ శాఖ పరిధిలోకి వెళ్లింది. ఈక్రమంలో వారు తరచూ వరదకాలువ పరిసరాలను తనిఖీ చేయడం అరుదుగా ఉంటుంది. ఈక్రమంలో ఎవరూ పట్టించుకోకపోవడంతో పారాఫిట్ వాల్ కూలడం, సిమెంట్ లేచి కంకర, స్టీల్ తేలి గుంతలు పడి వరదకాలువ వంతెన బురదమయంతో అధ్వాన్నంగా మారింది. వర్షాకాలం కావడంతో వరదకాల్వకు పెద్దఎత్తున నీటి ఇన్‌ఫ్లో ఉంటుంది. ఈ క్రమంలో వరదకాలువ వంతెనపై ఇరిగేషన్ అధికారులు దృష్టిసారించి మరమ్మతు పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పారాఫీట్ వాల్ నిర్మించాలి



దేశాయిపల్లి గ్రామ పరిసరాల్లో వరదకాల్వపై నిర్మించిన వంతెనకు రక్షణగా నిర్మించిన పారాఫీట్ వాల్ కొంతమేర కూలిపోయింది. వాల్ కూలిపోయిన ప్రదేశంలో వాహనం అదుపు తప్పితే వరదకాల్వలో పడిపోయే ప్రమాదం ఉంది. అధికారులు ముందు జాగ్రత్తగా పారాఫిట్ వాల్ నిర్మించాలి.

– ఎమిరెడ్డి నరేందర్‌రెడ్డి, దేశాయిపల్లి

మరమ్మతు పనులు చేపట్టాలి



వరదకాల్వపై నిర్మించిన వంతెన పరిసరాలు మొత్తం బురదమయంగా మారాయి. వంతెనపై పలుచోట్ల సిమెంట్ లేవడంతో గుంతలు పడి అందులో నీరు నిలుస్తోంది. వర్షాకాలంలో వాహనదారులు ప్రమాదాల బారినపడే అవకాశం ఉంది. వంతెన మరమ్మతు పనులు చేపట్టాలి.

–గోపు బాపురెడ్డి, దేశాయిపల్లి

నివేదిక అందిస్తాం



దేశాయిపల్లి వదకాలువ పరిసరాల్లో హైలెవల్ వంతెనపై కొంతమేర కూలిన పారాఫిట్ వాల్, ఇతర మరమ్మతు విషయంలో డీఈఈ తో క్షేత్రస్థాయిలో పరిశీలన చేయిస్తాం పాడైపోయిన చోట్ల మరమ్మతులకు సంబంధించి అంచనాలు తయారు చేసి అధికారులకు నివేదిక అందిస్తాం.

– శ్రీనివాస్ గుప్తా, ఇరిగేషన్, ఈఈ, కరీంనగర్, డివిజన్

మోదీ పాలనలోనే దేశాభివృద్ధి


కరపత్రం అందజేస్తున్న నాయకులు

బోయినపల్లి(చొప్పదండి): ప్రధానిగా నరేంద్ర మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని బీజేపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ జాడి బాల్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వెంకట్రావుపల్లిలో మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ప్రముఖులను కలిసి మోదీ తొమ్మిదేళ్ల పాలనకు సంబంధించిన పుస్తకాలు, కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో నాయకులు సారంపల్లి రాజు, జనగం లక్ష్మణ్, బాలయ్య, మోహన్‌బాబు, శివ, ఆవుల లక్ష్మణ్, తదితరులున్నారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి



సిరిసిల్లటౌన్: భారీ వర్షాల నేపథ్యంలో పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ కోరారు. శుక్రవారం ఆమె సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడారు. నాలుగు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండగా లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వార్డుల్లో ఏమైనా సమస్య లుంటే సంబంధిత కౌన్సిలర్ దృష్టికి తీసుకువస్తే తగు చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


బారికేడ్లు ఏర్పాటు చేస్తున్న ఏఎస్సై, సర్పంచ్

కోనరావుపేట: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మూలవాగు ప్రవహిస్తున్నందున ఆయా గ్రామాల్లో మూలవాగుకు వెళ్లే దారిలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. మండలంలోని వెంకట్రావుపేట, బావుసాయిపేట, మామిడిపల్లి, కనగర్తి గ్రామాల్లో మూలవాగు వద్ద, కొండాపూర్ పెంటివాగు వద్ద ఏర్పాటుచేశామని, ఎవరూ వాగులోకి వెళ్లొద్దన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలన్నారు.

కూలిన ఇల్లు

భారీ వర్షాలకు కోనరావుపేట మండలం కనగర్తిలో మాదాసు గంగవ్వ ఇల్లు కూలింది. కుటుంబ సభ్యులు వేరే ఇంట్లో తలదాచుకుంటున్నారు. ప్రభుత్వం తమకు పరిహారం అందించాలని బాధితులు కోరుతున్నారు.

బియ్యం వితరణ

గంభీరావుపేట: మండలకేంద్రంలోని దోసలగూడెంకు చెందిన లక్కంపల్లి రాజనర్సు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. శుక్రవారం బీఆర్ఎస్ పట్టణశాఖ ఉపాధ్యక్షుడు సిరిపురం అంజయ్య ఆధ్వర్యంలో పలువురు నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి 25 కిలోల బియ్యం అందజేశారు. కార్యకర్తల కుటుంబానికి పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని భరోసా కల్పించారు. నాయకులు పల్లె శ్రీనివాస్, చిట్టంపల్లి భిక్షపతి, మహేందర్, వికాస్‌బాబు, శంకర్, తదితరులున్నారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేసిన అసోసియేషన్ సభ్యులు

తంగళ్లపల్లి: మండలంలోని పద్మనగర్‌లో అంబటి సురేశ్ గురువారం ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబాన్ని శుక్రవారం టెక్స్‌టైల్ పార్కు జాఫర్ అండ్ హెల్పర్ అసోసియేషన్ సభ్యులు పరామర్శించారు. బాధిత కుటుంబానికి అసోసియేషన్ తరఫున రూ.27వేలు ఆర్థికసాయం అందజేశారు. ప్రభుత్వం స్పందించి టెక్స్‌టైల్ పార్కులో పరిశ్రమలు తెరిపించి కార్మికులకు పని కల్పించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. ఇక్కడ అసోసియేషన్ సభ్యులు, తదితరులున్నారు.

అపస్మారక స్థితిలో గ్రామ సేవకుడు

- మూడురోజుల కింద రోడ్డు ప్రమాదం
- చికిత్సకు ఇప్పటికే రూ.2లక్షలు ఖర్చు
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు


చికిత్స పొందుతున్న శ్రీనివాస్

ముస్తాబాద్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ గ్రామసేవకుడు అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. మండలంలోని చీకోడు గ్రామానికి చెందిన బోయ శ్రీనివాస్ (42) మూడురోజుల క్రితం గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు కామారెడ్డి జిల్లా కేంద్రానికి తరలించారు. తలకు తీవ్రగాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఇప్పటికే చికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రిలో రూ.2 లక్షలు ఖర్చయ్యాయని, మరో రూ.3 లక్షల వరకు ఖర్చవుతాయని వైద్యులు తెలిపారని, శ్రీనివాస్ భార్య గంగమణి ఆవేదన వ్యక్తం చేసింది. కూలీకి వెళ్తేగానీ పూట గడవని తమ చేతిలో చిల్లిగవ్వ లేదని, తన భర్తకు వైద్యం అందించేందుకు దాతలు ముందుకురావాలని వేడుకుంటుంది. 9177335490, 9959495777 నెంబర్‌కు ఫోన్ పే ద్వారా ఆర్థికసాయం అందించాలని ఆమె కోరుతుంది.


కార్యాలయాలకు వెళ్లేదెలా ?


నీటి పారుదలశాఖ కార్యాలయం ముందు నిలిచిన వర్షపు నీరు


ఎంఈవో కార్యాలయం ఎదుట..

వేములవాడ : ప్రభుత్వ కార్యాలయాల ముందు విస్తారంగా వర్షాలు కురువడంతో రోడ్లన్నీ బురదమయంగా మారాయి. వర్షం కురిసినప్పుడల్లా ఆయా కార్యాలయాల్లోకి ప్రజలు వెళ్లేందుకు దారిలేకుండా పోతోంది. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల పరిషత్ ఆవరణలోని నీటి పారుదలశాఖ, ఎంఈవో, మండల పరిషత్ కార్యాలయాల ఆవరణలో వర్షపునీరు నిలిచింది. కార్యాలయాల్లోకి ప్రజలు వెళ్లేందుకు వర్షపు నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

చేపల వేటకు పట్టణ ప్రజలు


చేపలు పడుతున్న పట్టణ ప్రజలు

వేములవాడరూరల్: మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ పంట పొలాలకు భారీగా నీరు చేరింది. కొత్త నీటిలో కొందరు చేపలు పడుతున్నారు. పట్టణంలోని బాలానగర్, ఎదురుగట్ల, కోనాయపల్లి తదితర ప్రాంతాల్లో భారీగా నీరు రావడంతో అందులో చేపలు పట్టేందుకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు.

'ఎస్సైపై చర్యలు తీసుకోవాలి'

ఇల్లంతకుంట: ఈనెల 2న పొత్తూరుకు చెందిన ఎస్సీ యువకులు ర్యాగటి అజయ్, తోడేటి అరవింద్‌పై ఇష్టం వచ్చినట్లు కొట్టిన ఎస్సై రాజేశ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళితహక్కుల పోరాట సమితీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం బాధిత యువకులను కలిశారు. యువకులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి ఎస్సై ఇబ్బందులు పెట్టారని, దీనిపై ఎస్పీకి బాధితులు ఫిర్యాదు చేశారన్నారు. ఎస్సైపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. మంద సుదర్శన్, మార్వాడి సుదర్శన్, బూరం అభినవ్, లక్ష్మణ్, రాకేశ్, దేవదాసు, అశోక్, మల్లేశం, పర్శరాములు, శ్రీకాంత్ తదితరులున్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


తంగళ్లపల్లిలో రోడ్డుపై కార్మికుల వంటా వార్పు


పొర్లు దండాలతో నిరసన తెలుపుతున్న కార్మికులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ మండలకేంద్రంలో కార్మికులు శుక్రవారం భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం ముందు కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె 16వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సీఐటీయూ మండల అధ్యక్షుడు జక్కుల మహేందర్ మాట్లాడుతూ..కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు మద్దతుగా ఉంటామన్నారు. ఇక్కడ భారతవ్వ, నర్సయ్య, రాందాస్, నర్సయ్య, రాములు, రాజయ్య, మైసయ్య, భూదయ్య, రామవ్వ, లింగవ్వ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై వంటా వార్పు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె మండలకేంద్రంలో కొనసాగుతోంది. తంగళ్లపల్లిలో వంటా వార్పు నిర్వహించి కార్మికులు తమ నిరసన తెలిపారు.

కోనరావుపేట: మండలకేంద్రంలో జీపీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్మికులు ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడించారు. 16 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడించినట్లు తెలిపారు.

పొర్లు దండాలతో నిరసన

వీర్నపల్లి: మండలకేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు పొర్లు దండాలు పెట్టి వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ భవనానికి నిధులు మంజూరు


మంజూరుపత్రం అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

కోనరావుపేట: మండలంలోని పల్లిమక్తలో ఎస్సీ కమ్యూనిటీ భవనం బ్యాలెన్స్ పనుల కోసం రూ.2 లక్షలు మంజూరైనట్లు జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం గ్రామసంఘం అధ్యక్షుడు మోకెనపల్లి బాలరాజ్‌కు మంజూరు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనం నిధులు లేక అసంపూర్తిగా మిగిలిపోయిందని సంఘం సభ్యులు తన దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ భవనానికి తమ నిధుల నుంచి రూ.2 లక్షలు కేటాయించామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎర్ర మల్లేశ్, సీనియర్ నాయకులు రాఘవరెడ్డి, సంఘ నాయకులు ఉన్నారు.

మంత్రి కేటీఆర్ ట్విట్టర్ పిట్ట కథలు మానుకోవాలి

- కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు మ్యాకల గణేశ్

చందుర్తి(వేములవాడ) : టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరించిన, పార్టీపై బుదర జల్లేందుకు ట్విట్టర్‌లో పోస్ట్‌చేసే పిట్ట కథలను మంత్రి కేటీఆర్ మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, జోగాపూర్ ఎంపీటీసీ మ్యాకల గణేశ్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు గంటల విద్యుత్ ఇచ్చే కాంగ్రెస్ కావాలా.. మూడు పంటలు కావాలా అంటూ పోస్టులు పెడుతూ రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను మానుకోవాలన్నారు. మూడు పంటలు సాగుచేసే రైతులకు రెండు పంటలకే రైతుబంధు ఇచ్చిన ప్రభుత్వం చేతులు దులుపుకుంటుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి రైతుల ఆదరణను చూసి ఓర్వలేకనే అధికార పార్టీ దిగజారుడు రాజకీయాలకు పూనుకుంటుందన్నారు. రానున్న ఎన్నికల్లో అన్నివర్గాల ప్రజలు బీఆర్ఎస్‌కు బుద్ధి చెబుతారన్నారు.

కోతకు గురైన కల్వర్టు


కోతకు గురైన బోయినపల్లి కల్వర్టు

బోయినపల్లి: బోయినపల్లి నుంచి కొదురుపాక వెళ్లే డబుల్ రోడ్డులో పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న కల్వర్టు శుక్రవారం కోతకు గురైంది. కల్వర్టుపై నుంచి వరదనీరు ప్రవహిస్తోంది. వంతెన ఎంట్రెన్స్‌లో భారీగా కోతకు గురైంది. శిథిలావస్థకు చేరడంతో రెండేళ్లుగా వంతెనపై నుంచి భారీగా వరదనీరు ప్రవహిస్తుండగా రాకపోకలు నిలిచిపోతున్నాయి. కాగా ×వంతెన నిర్మాణం ఎప్పుడు ? అనే శీర్శికన గురువారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. కాగా మరుసటి రోజే కల్వర్టు కోతకు గురై కయ్య పడింది.

ఆర్థిక చేయూత

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దుమాలలో వర్షాలకు ఇళ్లు కూలిపోయిన బాధితులకు శుక్రవారం తహసీల్దార్ జయంత్‌కుమార్ ఆర్థికసాయం అందించారు. గ్రామానికి చెందిన బైరి భూమవ్వ, జాలపల్లి సాయవ్వ, సల్మాల రాములు,షేక్ హైదర్‌ల ఇళ్లు కూలిపోవడంతో ఒక్కొక్కరికి రూ.3,200 చొప్పున నగదు అందజేశారు. శిథిలావస్థలో ఉన్న ఇంట్లో ఉంటున్న జాలపల్లి ఎల్లవ్వ సురక్షిత ప్రాంతానికి తరలించి 50 కిలోల బియ్యం అందజేశారు. సర్పంచ్ కదిరె రజిత, ఉపసర్పంచ్ హన్మంతు, ఆర్ఐ సంతోష్, నాయకులు అంజయ్య, రవి, డీలర్ శ్రీ నివాస్, వీఆర్ఏ భాస్కర్, రామకృష్ణ, భూమయ్య ఉన్నారు.